జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 1 | జులై | 2026 ◆ పేజీలు : 7



## సర్ ప్రక్రియను సమర్థ వంతంగా నిర్వహించాలి: ఎమ్మెల్యే



**ఇల్లెందు, జూన్ 30 (ప్రజాజ్యోతి)** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. మంగళవారం మండలంలోని తిలక్ నగర్, పొలారం గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ ఐఆర్ ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సంఘం అందజేస్తున్న దరఖాస్తు పత్రాలను ఓటర్లకు అందించారు. వాటిని ఎలా పూరించాలి, వాటి ప్రాధాన్యత ఏమిటి

మిగతా 2 లో...




6 లో..

# జెన్కోతో సింగరేణి బంధాలకు బీటలు...!

- జెన్కోకు బొగ్గు రవాణా తగ్గించిన సింగరేణి..
- మొండి బకాయిల నేపథ్యంలోనే ఈ నిర్ణయం..
- అప్రాధాన్య జాబితాలోకి జెన్కో..
- థర్మల్ కేంద్రాల్లో పడిపోయిన బొగ్గు నిల్వలు..
- పలు కేంద్రాల్లో యూనిట్లను మూసేసిన వైనం..
- బొగ్గు కొరతతో పవర్ ప్లాంట్లలో సతమతమవుతున్న అధికారులు..
- రాష్ట్ర విద్యుత్ భద్రతపై పెరుగుతున్న ఆందోళన..
- రాష్ట్ర విద్యుత్ అవసరాల కంటే వ్యాపారానికే పెద్దపీట వేస్తున్న సింగరేణి..?

తెలంగాణ విద్యుత్ రంగానికి రెండు కళ్లుగా భావించే సింగరేణి, తెలంగాణ జెన్కో మధ్య సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంతగా దెబ్బతిన్నాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జోరుగా సాగుతోంది. జెన్కో నుంచి సింగరేణికి వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడం, వాటి చెల్లింపులో నెలకొన్న జాప్యమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. మరోవైపు సింగరేణి కూడా లాభదాయకమైన మార్కెట్ల వైపు అడుగులు వేయడంతో ఈ రెండు సంస్థల బంధాలకు బీటలు పడినట్లు సమాచారం. ఈ పరిణామాలే ఇప్పుడు రాష్ట్ర విద్యుత్ రంగంలో కొత్త ఆందోళనలకు దారితీస్తున్నాయి.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జూలూరుపాడు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్



**జూలూరుపాడు, జూన్ 30, ప్రజాజ్యోతి:** జూలూరుపాడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, మధ్యాహ్న భోజనం, తాగునీరు, మౌలిక వసతులను పరిశీలించారు. ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు, ఔటింగ్ రిజిస్టర్, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. విద్యార్థినులను తల్లిదండ్రులు లేదా అధికారికంగా అనుమతించిన సంరక్షకులతో మాత్రమే బయటకు పంపాలని సూచించారు. ఆర్ వో ప్లాంట్ మరమ్మతులను వెంటనే పూర్తి చేసి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

మిగతా 2 లో...

## ఉద్దీపకం బోధనలో నాణ్యత పెంచాలి

- ఐటీడీఏ పీవో బి. రాహుల్



**చర్ల, జూన్ 30:(ప్రజాజ్యోతి):** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు పునాది స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందేలా ఉద్దీపకం వర్క్ బుక్ ను సమర్థవంతంగా బోధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఉపాధ్యాయులను ఆదేశించారు.మంగళవారం చర్ల మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని ఉన్న చెన్నాపురం, ఉయ్యాలమడుగు జీపీఎస్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై కొంతసేపు ఉపాధ్యాయుడిగా బోధించడమే కాకుండా విద్యార్థి పాత్ర పోషిస్తూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలపై పిల్లల అవగాహనను స్వయంగా పరీక్షించారు.పిల్లలను బోర్డుపై రాయించి, వర్క్ బుక్ లోని పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడగగా, చాలామంది విద్యార్థులు

మిగతా 2 లో...

# భారీ గంజాయి పట్టివేత

- సినీ ఫక్కీలో గంజాయి తరలింపు
- మత్తులో చిత్తవుతున్న యువత...



**బూర్గంపహాడ్ జూన్ 30 (ప్రజాజ్యోతి):** మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక చర్యల్లో భాగంగా తెలంగాణా 'ఈగిల్ ఫోర్స్' కు చెందిన ఖమ్మం రీజినల్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్(RNCC), భద్రాద్రి జిల్లా పోలీసులు మంగళవారం నిర్వహించిన కీలకమైన జాయింట్ ఆపరేషన్ లో భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది.ఈ ఘటనలో రూ. 2.62 కోట్ల విలువైన 525 కిలోల గంజాయితో పాటు ఒక కంటైనర్ లారీ, ఎస్కార్ట్ వాహనంగా వినియోగించిన బజాజ్ పల్సర్ బైక్, ఐదు సెల్ ఫోన్లను, రూ. 10,570 మొత్తపు నగదును స్వాధీనం చేసుకున్నారు.దుర్గంపహాడ్ మండలసమీపంలోని ఐటీసీ పేపర్ బోర్డ్ కంపెనీ వెస్ట్ గేట్ వద్ద

మిగతా 2 లో...

## ఉద్దీపకం బోధనలో నాణ్యత పెంచాలి

(మొదటి పేజీ తరువాయి...)



ఉద్దీపకం వర్క్ బుక్ అంశాలతో పాటు చతుర్వేద అభ్యాస ప్రక్రియల్లో వెనుకబడి ఉన్నట్లు గుర్తించిన పీవో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థికి వర్క్ బుక్ లోని అంశాలపై పూర్తి అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు ప్రతిరోజూ ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని సూచించారు.పిల్లల హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరచాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ప్రతిరోజూ విధులకు హాజరుకావాలని ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణను కేవలం పేరుకే కాకుండా పిల్లలు అర్థం చేసుకుని స్వయంగా రాసే స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా చెన్నాపురం జీపీఎస్ పాఠశాలలో 55 మంది విద్యార్థులు చదువుతున్న నేపథ్యంలో అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని పాఠశాల సిబ్బంది కోరగా త్వరలోనే మరో ఉపాధ్యాయుడిని నియమించే చర్యలు తీసుకుంటామని పీవో హామీ ఇచ్చారు.అనంతరం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందన తిమ్మిరిగూడెం జీపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యా కార్యక్రమాలను పరిశీలించారు.ఈ తనిఖీల్లో డిప్యూటీ డైరెక్టర్ చందనతో పాటు ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి: ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి...)

అనే విషయాలను ప్రజలకు వివరించారు. అనంతరం కొమరారం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తికావడంతో లబ్ధిదారుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులు భుక్యా ప్రవళిక, కోరం రమాదేవి కుటుంబ సభ్యులతో కలిసి గృహ ప్రారంభోత్సవాన్ని నిర్వహించి, నూతన గృహంలో ప్రవేశం చేయించారు. అనంతరం కొమరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులను తగినంత నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండల రాంమహేష్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎట్టి హరికృష్ణ, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షురాలు పాయం స్వాతి, తిలక్ నగర్ సర్పంచ్ ధనసరి స్రవంతి రాజు, పొలారం గ్రామ ఉపసర్పంచ్ ధారవత్ చంద్రశేఖర్, సర్పంచులు వల్లాల మంగమ్మతో పాటు నాయకులు పూనెం సురేందర్, మూతి కృష్ణ, తాటి భిక్షం, కల్తీ పద్మ, తారాచంద్, పాయం కృష్ణప్రసాద్, కాకటి భార్గవ్, మోడెం సంపత్, చెన్నూరి కృష్ణ, ప్రసన్న కుమార్, వీరా నాయుడు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బుర్హానుద్దిన్ బాబా ఉర్సు వేడుకలు ఘనంగా నిర్వహణ

- **బేతంపూడి దర్గా నుంచి గంధం తీసుకొచ్చి బాబా సన్నిధిలో ప్రతిష్ఠించిన భక్తులు**



**టేకులపల్లి, జూన్ 30,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని రోళ్ళపాడు సమీపంలో ఉన్న బుర్హానుద్దిన్ బాబా దర్గాలో మంగళవారం ఉర్సు మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.బేతంపూడి దర్గా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఉర్సు సందర్భంగా బేతంపూడి దర్గా నుంచి సంప్రదాయబద్ధంగా గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి, బుర్హానుద్దిన్ బాబా సన్నిధిలో ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక దువాలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే ఉర్సు వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని బాబా ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు తబర్రుక్ (ప్రసాదం) పంపిణీ చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై విచారణ జరపాలి

- **డీఈఓకు బీజేపీ నాయకుల వినతి**



**పాల్వంచ, జూన్ 30, ప్రజా జ్యోతి :** పాల్వంచ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రిని బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారంటూ.. ఈ అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకుడు పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డీఈఓను కలిసి పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. నర్సరీ విద్యార్థులకే రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు పుస్తకాలు, నోట్‌బుక్స్ పేరుతో వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. యూనిఫాంలు, పుస్తకాలు, బ్యాగులు, షూస్ తదితర వస్తువులను ఒకే చోట కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసే విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే పార్కింగ్, ఆటస్థలం, తాగునీరు, అగ్నిమాపక, భవన భద్రత వంటి కనీస మౌలిక సదుపాయాలు లేని విద్యాసంస్థలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న పాఠశాలలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు ప్రశ్నించినందుకు విద్యార్థులపై వివక్ష చూపుతున్న యాజమాన్యాలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, అవసరమైతే గుర్తింపును రద్దు చేయాలని డీఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దున్నపోతుల రాజు, భూక్యా మోహన్, మాలోత్ ప్రశాంత్, భట్టు అశోక్, గోళ్ళ శ్రీమాన్ నారాయణ, కనకాల క్రాంతి, సంకినేని రుద్ర, అజ్మీరా హాథీరామ్, కొత్తపల్లి విజయ్, బియ్యని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జన్మనిస్తుంది అమ్మ... పునర్జన్మనిస్తుంది డాక్టర్..!

- **జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం**
- **ప్రాణాలను కాపాడే దేవుళ్లకు సమాజం నివాళి**
- **సేవే పరమావధిగా రోగులకు అండగా నిలుస్తున్న వైద్యులు**

**టేకులపల్లి,జూన్ 30,ప్రజాజ్యోతి:** తల్లి మనకు జన్మనిస్తే,ఆ జన్మను ప్రమాదాల బారిన పడకుండా కాపాడి, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మను ప్రసాదించేది వైద్యుడు.అందుకే వైద్యుడి ని ప్రత్యక్ష దైవంగా అభివర్ణిస్తారు.రోగి ప్రాణాలను నిలబెట్టడమే ధ్యేయంగా రాత్రింబవళ్లు శ్రమిస్తూ,బాధలో ఉన్న వారికి ధైర్యాన్ని నింపుతూ, ఆశను కల్పించే మహోన్నత సేవ వైద్య వృత్తి. అలాంటి వైద్యుల సేవలను స్మరించుకునే రోజే ప్రతి ఏడాది జూలై 1న నిర్వహించే జాతీయ వైద్యుల దినోత్సవం.అనారోగ్యంతో ఆసుపత్రికి చేరిన రోగికి చికిత్స అందించి తిరిగి సాధారణ జీవితాన్ని ప్రసాదించే బాధ్యతను వైద్యులు నిర్వర్తిస్తుంటారు. వైద్య శాస్త్రంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ ఎన్నో క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్నారు.ప్రజారోగ్య పరిరక్షణలో వారి పాత్ర ఎనలేనిది.కరోనా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించిన వైద్యుల త్యాగం దేశం ఎన్నటికీ మరచిపోలేదు. క్లిష్ట సమయాల్లో వారు చూపిన సేవా భావం వైద్య వృత్తి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.వైద్య సేవలను గౌరవించేందుకు,సమాజానికి వారు అందిస్తున్న అమూల్యమైన సేవలకు కృతజ్ఞతలు తెలిపేందుకు, యువతలో సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రతి ఏడాది జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ప్రాణాలను కాపాడిన వైద్యులను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 30,(ప్రజాజ్యోతి)** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు, స్థానిక మున్సిపల్ పరిధిలోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ నందు 2026-27 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఏ ఐ కోఆర్డినేటర్ జి.భాస్కరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం , సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) లక్ష్యాలకు అనుగుణంగా, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు , చదువును మధ్యలో ఆపిన ఇతర వర్గాల వారు తమ విద్యా ప్రమాణాలను మెరుగు పరుచుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రవేశాలు పొందిన వారికి సెలవు దినాలలో అవగాహన తరగతులతో పాటు ఆన్లైన్ తరగతులు కూడా నిర్వహించబడతాయని, అదేవిధంగా సులభంగా ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందన్నారు, కావున ఆసక్తి గల అభ్యాసకులు మరిన్ని వివరాల కోసం 9866806532 నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

## భారీ గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

ఆయా విభాగాల పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించారు.'ఈగిల్ ఫోర్స్' వెల్లడించిన వివరాల ప్రకారం.. నిందితుడు సహదేవ్ హంతల్ ఒడిషాలోని అల్లూరికోట అటవీ ప్రాంతం నుంచి ఈ భారీ మొత్తపు గంజాయిని సేకరించాడు.అక్కడి నుంచి ఏపీలోని మోతుగూడెం-తులసిపాక వరకు గంజాయి బస్తాలను తరలించడానికి కొందరు కూలీలను నియమించుకున్నాడు. ఆ తర్వాత తరలించిన గంజాయిని మహ్మద్ సైఫ్, ఫిరోజ్ భాయ్ లకు చెందిన కంటైనర్ లారీలో లోడ్ చేశారు.గంజాయి బస్తాలు పోలీసులకు కనిపించకుండా దాచడానికి కంటైనర్లో ప్రత్యేకంగా ఓ ఛాంబర్ ను తయారు చేయించుకోవడం గమనార్హం.కంటైనర్ లోని ప్రత్యేక ఛాంబర్ లో దాచిన గంజాయి బస్తాలను తులసిపాక నుంచి భద్రాచలం, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ మీదుగా మహారాష్ట్రకు, ఉత్తరప్రదేశ్ కు తరలించడానికి బయలుదేరారు.కాగా ఆయా ముఠా గంజాయిని పెద్ద ఎత్తున అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఖచ్చితమైన సమాచారం అందుకున్న ఈగిల్ ఫోర్స్, భద్రాద్రి జిల్లా పోలీసులు తులసిపాక నుంచి బయలుదేరిన కంటైనర్ ను, దానికి ఎస్కార్టుగా ముందున్న బైక్ కదలికలను నిరంతరం పర్యవేక్షించారు.ఈ విషయం గ్రహించని గంజాయి అక్రమ రవాణా ముఠాకు చెందిన కంటైనర్ సారపాకలోని ఐటీసీ పేపర్ బోర్డ్స్ సంస్థకు చెందిన వెస్ట్ గేట్ వద్దకు రాగానే ఈగిల్ ఫోర్స్, భద్రాద్రి జిల్లా పోలీసులు అడ్డుకున్నారు. రూ. 2.62 కోట్ల విలువైన 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఒడిషాలోని మల్కనగిరికి చెందిన సహదేవ్ హంతల్ (20), అల్లూరి జిల్లా సోమిరెడ్డి పాలేనికి చెందిన డోగ్రి త్రినాథ్ (38),ఉత్తరప్రదేశ్ లోని బీజాపూర్ కు చెందిన కులదీప్ శర్మ (27)లతోపాటు మరో బాలున్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయి అక్రమ రవాణా కేసులో మిగతా నిందితులైన మహ్మద్ సైఫ్, ఫిరోజ్ భాయ్, రాజా మిశ్రా, మహ్మద్ ఇమ్రాన్ పరారీలో ఉన్నట్లు ఈగిల్ ఫోర్స్ ప్రకటించింది.కాగా ఇటీవలి కాలంలో చాలా మంది యువకులు, విద్యార్థులు మాదకద్రవ్యాలకు (డ్రగ్స్) బానిసలవ్వడం, నేరాలు చేయడం, ఇతర సామాజిక వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని ఈగిల్ ఫోర్స్ ఈసందర్భంగా పేర్కొంది. ఈ దుష్ప్రభావం వల్ల అనేక కుటుంబాలు బాధితులుగా మారాయని, మాదకద్రవ్యాల బారిన పడవద్దని యువతకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేసింది. అలాగే తమ పిల్లల కార్యకలాపాలపై నిఘా ఉంచాలని తల్లిదండ్రులకు 'ఈగల్ ఫోర్స్' సూచించింది.

## పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పప్పు నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. మళ్లీ ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, నాణ్యతలో లోపాలు పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రత, తాగునీరు, భద్రత, పోషకాహారం, మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి, ఎంఈఓ జుంకీలాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెంట్లం విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సిఎండి వరుణ్ రెడ్డి

- రాజపురం గ్రామానికి 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు.. గ్రామస్థుల హర్షం



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 30 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల పెంట్లం విద్యుత్ ఉపకేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర టీజీఎన్‌పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి సోమవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. విద్యుత్ సరఫరా తీరు, నిర్వహణ పనితీరును నేరుగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్న అన్నపురెడ్డిపల్లి విద్యుత్ శాఖ ఏఈ తరుణ్‌ను అభినందించారు.అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలంలోని రాజపురం గ్రామానికి నూతనంగా మంజూరైన 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రెండు విద్యుత్ ఉపకేంద్రాలు అందుబాటులోకి రావడంతో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడి, వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు.రాజపురం గ్రామానికి 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మంజూరు కావడంతో గ్రామ పెద్దలు భీమిరెడ్డి రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దుబాకుల రాము, గణపతి రెడ్డి, చినముత్యం, బన్నె చెన్నారావు సిఎండి వరుణ్ రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సీ మహేందర్, డీఈ రంగస్వామి, ఏడీఈ రవికుమార్, అన్నపురెడ్డిపల్లి ఏఈ తరుణ్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్ఫేర్ బోర్డు పథకాల ప్రైవేటీకరణ ఆపాలి

- సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు



**ములకలపల్లి, జూన్ 30 (ప్రజాజ్యోతి):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నిరసనల్లో భాగంగా మంగళవారం ములకలపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ స్వాతి బిందుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకే వెల్ఫేర్ బోర్డు పథకాలు వర్తింపజేయాలని, అనర్హుల లేబర్ కార్డులను రద్దు చేయాలని, సహజ మరణ బీమాను రూ.5 లక్షలకు పెంచాలని, 55 ఏళ్లు పైబడిన కార్మికులకు నెలకు రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, ఇళ్లు లేని కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సూరం పుల్లారావు, ఓరుగంటి శ్రీను, హలావత్ శివ, పోక్కిలి దానియేలు, ఎస్.కే. మస్తాన్, సంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం బీఎస్పీతోనే సాధ్యం

- బీఎస్పీ మండల అధ్యక్షుడు పాయల మోహన్ రావు



**చర్ల, జూన్ 30 :(ప్రజాజ్యోతి):**ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) చర్ల మండల అధ్యక్షుడు పాయల మోహన్ రావు ఆరోపించారు.మంగళవారం చర్లలో నిర్వహించిన బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని, దీనివల్ల పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు.సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కనిపించడం లేదని, ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాలు, సంపదను సమానంగా పంచే లక్ష్యంతో పనిచేసేది బహుజన్ సమాజ్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు తమ ఓట్లతో తామే అధికారంలోకి వచ్చినప్పుడే బడుగు, బలహీన వర్గాల ఆశలు నెరవేరుతాయని, సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ధ్రువ నరసింహారావు, కకా నరసయ్య, చాప భాస్కరరావు, ధర్మరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారులకు సర్పంచ్ ల సన్మానం





**చర్ల, జూన్ 30: (ప్రజాజ్యోతి):** చర్ల మండల సర్పంచ్ ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘం మండల అధ్యక్షురాలు సోయం నాగలక్ష్మి, ఉపాధ్యక్షుడు జమ్ముల మురళి, కోశాధికారి తుర్రం రవికుమార్ నేతృత్వంలో మండలంలోని సర్పంచ్ లు శిక్షణలో భాగంగా చర్ల మండలానికి విచ్చేసి ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ట్రైనీ కలెక్టర్ (ఐఏఎస్) మురళిని ఘనంగా శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఈదయ్యను కూడా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సర్పంచ్ లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పీఆర్ పీ నిలుపుదల ఎత్తివేయాలి

- సింగరేణి అధికారుల పనితీరు ప్రోత్సాహక వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- సీఎంఓఏఐ రిలే నిరాహార దీక్షకు డా. బి. జనక్ ప్రసాద్ సంఘీభావం

**కొత్తగూడెం (సింగరేణి), జూన్ 30, ప్రజాజ్యోతి :** సింగరేణి అధికారులకు రావాల్సిన పనితీరు ప్రోత్సాహక వేతనం (పీఆర్ పీ) నిలుపుదలను వెంటనే ఎత్తివేసి, బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్ టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ కోరారు. సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం ఎదుట సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు మంగళవారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. అధికారుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సానుకూల దృక్పథంతో వెంటనే పరిష్కరించాలని కోరారు. అధికారులకు సంబంధించిన పనితీరు ప్రోత్సాహక వేతనం నిలుపుదల అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవల సింగరేణి ఛైర్మన్, డైరెక్టర్లతో జరిగిన సమావేశంలోనూ ఈ అంశంపై చర్చించినట్లు చెప్పారు. అధికారులకు వేతన శ్రేణుల మెరుగుదలతో పాటు పనితీరు ప్రోత్సాహక వేతనాన్ని అమలు చేయడంలో ఎలాంటి సాంకేతిక లేదా పరిపాలనా అడ్డంకులు లేవని, ఈ సమస్యను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైనట్లు వెల్లడించారు. సింగరేణి అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి రావాల్సిన న్యాయమైన ప్రయోజనాలను వెంటనే అందించాలని డా. జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ నాయకుడు మంద నర్సింహారావు కూడా దీక్షకు సంఘీభావం ప్రకటించారు. ఉత్పత్తి పెంపు కోసం అధికారులు అంకితభావంతో పనిచేస్తున్నారని, వారికి రావాల్సిన వేతన శ్రేణుల మెరుగుదల, పనితీరు ప్రోత్సాహక వేతనాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. దీనివల్ల సంస్థపై అదనపు భారం పడదని, భవిష్యత్తులో సంస్థ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారుల సంఘం నాయకులు, ఐఎన్ టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు త్యాగరాజన్, ప్రధాన కార్యదర్శి వికాస్, ప్రాంతీయ ప్రధాన కార్యదర్శి ఆల్బర్ట్, ఉపాధ్యక్షులు పీతాంబరం, రజాక్, కార్యదర్శులు అభిషేక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు

**ములకలపల్లి, జూన్ 30 (ప్రజాజ్యోతి):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం, వైద్యశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు గ్రామగ్రామాన వైద్య శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంలో శానిటేషన్ పనులను వెంటనే చేపట్టి, దోమల నివారణ కోసం ఫాగింగ్, మందుల పిచికారీ నిర్వహించాలని అధికారులను కోరారు. మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.



గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుని, వీధులు మురికివాడలుగా మారకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు గౌరీ నాగేశ్వరరావు, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి, మంచాల సారయ్య, గోపగాని లక్ష్మీనరసయ్య, బుగ్గ వెంకట నరసమ్మ, కొంద్రు రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు కాల్వలకు మరమ్మత్తులు చేపట్టాలి

- సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి





**ములకలపల్లి, జూన్ 30 (ప్రజాజ్యోతి):** మూకమామిడి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలను సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో కలిసి కాల్వల గండ్లు, నీటి విడుదల గేట్లు, పూడిక పేరుకుపోయిన ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నప్పటికీ కాల్వలకు మరమ్మత్తులు చేపట్టకపోవడంతో సాగునీటి సరఫరా ఇబ్బందిగా మారిందన్నారు. కాల్వల గట్లు పలుచోట్ల తెగిపోవడంతో నీరు వృథాగా పోతోందని, కాల్వల్లో పూడిక అధికంగా పేరుకుపోవడంతో నీటి ప్రవాహం సరిగా సాగడం లేదని తెలిపారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి కాల్వల గండ్లు పూడ్చడం, పూడిక తొలగించడం, గేట్లకు మరమ్మత్తులు చేయడం వంటి పనులను అత్యవసరంగా చేపట్టాలని కోరారు. రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకునేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని కాల్వలను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మడకం భద్రయ్య, ప్రసాద్, దివాకర్, గడ్డ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల దీక్షలకు పెరుగుతున్న మద్దతు

- రెండో రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు
- ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్, సీఐటీయూ నాయకుడు నర్సింహారావు సంఘీభావం




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 30, ప్రజా జ్యోతి :** పే అప్‌గ్రేడేషన్ అమలు, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) బకాయిల చెల్లింపు, పదోన్నతుల కల్పన తదితర డిమాండ్ల సాధన కోసం సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. సింగరేణి కార్పొరేట్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న దీక్షల్లో అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి డా. బి. జనక్ ప్రసాద్, సీఐటీయూ నాయకుడు నర్సింహారావు సందర్శించి అధికారులకు సంఘీభావం ప్రకటించారు. అధికారుల డిమాండ్లు న్యాయమైనవేనని, యాజమాన్యం చర్చలకు ముందుకొచ్చి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా అధికారుల సంఘం నాయకులు మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ లభించే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ బకాయిలు, పదోన్నతుల అంశాల్లో తక్షణ నిర్ణయం తీసుకోవాలని మరోసారి డిమాండ్ చేశారు.

# 'ప్రజాజ్యోతి' కథనానికి స్పందన

- చర్లలో శుభ్రతకు అధికారుల చర్యలు






ప్రజాజ్యోతి

డ్రైనేజీలు శుభ్రం చేసేది ఎప్పుడు..?





**చర్ల, జూన్ 30:(ప్రజాజ్యోతి):** చర్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని డ్రైనేజీలు, పారిశుద్ధ్య సమస్యలపై 'ప్రజాజ్యోతి' పత్రికలో "డ్రైనేజీలు శుభ్రం చేసేది ఎప్పుడు..?" అని ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. కథనం వెలువడిన వెంటనే సోమవారం గ్రామంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీల వెంట పెరిగిన గడ్డి, కలుపుమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగిస్తూ పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ పరిధిలోని అన్ని డ్రైనేజీలను దశలవారీగా పూర్తిస్థాయిలో శుభ్రం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందిలో కొందరు సెలవుల్లో ఉండటంతో పనులు ప్రారంభించడంలో స్వల్ప జాప్యం జరిగిందని, అయితే 'ప్రజాజ్యోతి' కథనం అనంతరం పనులను మరింత వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఒక ప్రాంతం చొప్పున డ్రైనేజీలను శుభ్రం చేసి, అనంతరం కలుపుమొక్కల నివారణ మందులు, దోమల నియంత్రణ కోసం ప్రత్యేకంగా మందు పిచికారీతో పాటు ఫాగింగ్ కార్యక్రమాన్ని కూడా చేపడతామని తెలిపారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు ప్రారంభం కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే వేగంతో పనులు పూర్తి చేసి చర్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను కోరుతున్నారు.

## యూరియా స్టాక్ అప్‌డేట్ సమయంలో యాప్ మొరాయింపు.. రైతులకు తీవ్ర ఇబ్బందులు

- ♦ స్టాక్ నమోదు చేసిన వెంటనే స్తంభిస్తున్న యాప్
- ♦ కనిపించని యూరియా స్టాక్.. బుకింగ్ చేసుకోలేక రైతుల అవస్థలు
- ♦ యాప్ తిరిగి పనిచేసేలోపే ఖాళీ అవుతున్న స్టాక్
- ♦ ఫెర్టిలైజర్ దుకాణాల యాజమాన్యానికి ముందే సమాచారం చేరుతోందన్న రైతుల ఆరోపణలు
- ♦ సమగ్ర విచారణ జరిపి లోపాలను నివారించాలని అధికారులకు వినతి

**టేకులపల్లి, జూన్ 30, ప్రజాజ్యోతి:** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అత్యవసరమైన యూరియా ఎరువుల బుకింగ్ ప్రక్రియ టేకులపల్లి మండలంలో సాంకేతిక సమస్యలతో తీవ్ర ఇబ్బందుల కు గురవుతోంది. యూరియా స్టాక్‌ను ఆన్‌లైన్‌లో అప్‌డే ట్ చేసిన సమయంలో మొబైల్ యాప్ పూర్తిగా మొరాయిస్తుండ డంతో రైతులు బుకింగ్ చేసుకోలేక తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ సమయాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసే యాప్, యూరియా స్టాక్ విడుదల చేసిన స మయంలో మాత్రం చాలా స్లోగా మారడం లేదా పూర్తిగా ఓ పెన్ కాకపోవడం జరుగుతోందని రైతులు చెబుతున్నారు. స్టాక్ అందుబాటులోకి వచ్చిన సమయంలో యాప్‌లో యూరియా వివరాలు కూడా కనిపించకపోవ డంతో రైతులు పదేపదే లాగిన్ అవుతూ గంటల తరబడి ప్రయత్నించినా బుకింగ్ చేసుకోలేకపోతున్నారని వాపోతున్నారు. అయితే, యాప్ తిరిగి పనిచేసే సమయానికి యూరియా స్టాక్ మొత్తం బుక్ అయిపోతుండటంతో నిజంగా అవసరమైన రైతులు ఎరువులు పొం దలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల సాగు పనులు కూడా ఆలస్యమవుతున్నాయని తెలిపారుయూరి యా స్టాక్ వివరా లు సాధారణ రైతులకు తెలియకముందే కొన్ని ఫెర్టిలైజర్ దుకాణాల యాజమాన్యాలకు సమాచారం చేరుతోందని, వారు ముందుగానే బుకింగ్ చేసుకుంటున్నారనే ఆరోపణలను రైతులు చేస్తున్నారు. ఈ ఆరోపణలకు ప్రస్తుతం అధికారిక ధృవీకరణ లేదని గమనించాలి. ఈ అంశంపై వ్యవసాయ శాఖ సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలికి తీయాలని రైతులు కోరుతున్నారు. రైతులకు కూడా యూరియా స్టాక్ అప్‌డేట్ అయిన వెంటనే ఎస్ఎంఎస్, మొబైల్ నోటిఫికేషన్ లేదా ఇతర మార్గాల ద్వారా సమాచారం అందించే విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీంతో అందరికీ సమాన అవకాశం లభించి పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యపై పలువురు రైతు లు మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేస్తూ, యాప్‌లోని సాంకేతిక లోపాలను వెంటనే సరిదిద్దాలని, యూరియా బుకింగ్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని, సమగ్ర విచారణ నిర్వహించి ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అవిశ్వాస తీర్మానం వీగింది

- అధ్యక్షురాలికి మెజార్టీ సభ్యుల మద్దతు





**చర్ల, జూన్ 30: (ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహాజన గ్రామసభలో చీమలపాడు శిగ్రాజుల ఇసుక సహకార సంఘంపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. శిగ్రాజుల ఇసుక సహకార సంఘం అధ్యక్షురాలు తెల్లం కౌశల్యపై అవిశ్వాస తీర్మానం తీసుకురావాలని సంఘంలోని ఒక వర్గం సభ్యులు సహకార శాఖ అధికారులకు వినతి అందజేయడంతో, నిబంధనల ప్రకారం మహాజన గ్రామసభను నిర్వహించారు. మొత్తం 176 మంది సభ్యులు ఉన్న సంఘంలో అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 74 మంది సభ్యులు ముందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే మహాజన గ్రామసభలో సభ్యుల అభిప్రాయాలను సేకరించగా, అధ్యక్షురాలు తెల్లం కౌశల్యకు 87 మంది సభ్యులు మద్దతుగా సంతకాలు చేసి తమ విశ్వాసాన్ని ప్రకటించారు. దీంతో అవిశ్వాస తీర్మానానికి అవసరమైన మెజార్టీ లభించకపోవడంతో అది వీగిపోయినట్లు సహకార శాఖ అధికారులు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించిన సభ్యుల్లో పలువురు సమావేశానికి గైర్హాజరయ్యారు. మరోవైపు మెజార్టీ సభ్యుల మద్దతు లభించడంతో చీమలపాడు శిగ్రాజుల ఇసుక సహకార సంఘానికి సంబంధించిన అనుమతుల ప్రక్రియకు మార్గం సుగమమైంది. సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎన్. శ్రీనివాసరావు, డివిజన్ కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సుజాత, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాకుసుమం గుర్రం దేవదాస్‌కు ఘన వీడ్కోలు

- 37 ఏళ్ల నిరుపమాన విద్యాసేవలకు ముగింపు
- సులానగర్ పాఠశాలలో భావోద్వేగ వీడ్కోలు సభ
- హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకులపల్లి, జూన్ 30,ప్రజాజ్యోతి:** మండలంలోని సులానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన గుర్రం దేవదాస్ మంగళవారం పదవీ విరమణ చేశారు. విద్యాశాఖలో 37 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించిన ఆయన, అందులో 14 సంవత్సరాలు సులానగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహించి విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల పురోగతికి విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన సభ అత్యంత వైభవంగా, భావోద్వేగ వాతావరణంలో జరిగింది. సభ ప్రారంభానికి ముందు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేకంగా హాజరై గుర్రం దేవదాస్‌ను ఘనంగా సన్మానించి, ఆయన విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు.విశ్రాంత జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సభాధ్యక్షులు లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ గుర్రం దేవదాస్ సేవలను ప్రశంసించారు. ఆయన క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల ఉన్న మమకారం, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి భావోద్వేగంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో సులానగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మా నాయక్, గెజిటెడ్ హెచ్‌ఎంల జిల్లా అధ్యక్షుడు బాలాజీ, లక్ష్మీదేవిపల్లి ఎంఈఓ కృష్ణయ్య, టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్, యూటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు కిషోర్ సింగ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరసయ్య, టీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్, పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు టి. రవీందర్, ముత్యాలంపాడు హెచ్‌ఎం రాంచందర్ సింగ్, కుంటాల హెచ్‌ఎం రవి, బొమ్మనపల్లి హెచ్‌ఎం మంగీలాల్, బేతంపూడి హెచ్‌ఎం తారా సింగ్, రిటైర్డ్ ఎంఈఓ స్వామి దాసు, పిల్లి శ్రీనివాస్, ఉపసర్పంచ్ చెన్నయ్య, గ్రామ పెద్ద ఉండేటి బసవయ్య, సులానగర్ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గుర్రం దేవదాస్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

## సింగరేణి అధికారుల పోరాటానికి మద్దతు




**ఇల్లెందు, జూన్ 30 (ప్రజా జ్యోతి )**తమ సమస్యల పరిష్కారం కోసం సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఇల్లందు సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న సీఎంఓఏఐ అధికారుల దీక్షా శిబిరాన్ని మంగళవారం బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, టీబీజీకేఎస్ ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. రంగనాథ్ లు మాట్లాడుతూ వేతన సవరణలో భాగంగా మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం చెల్లింపు కోసం సింగరేణి అధికారులు ఆందోళన చేపట్టి రోడ్డెక్కడం సంస్థ చరిత్రలో ఇదే తొలిసారన్నారు. సింగరేణి వేల కోట్ల రూపాయల లాభాల్లో అధికారుల కృషి కూడా కీలక భాగమని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులతో పాటు అధికారులకు కూడా పీఆర్‌పీ సక్రమంగా చెల్లించారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు రావాల్సిన పీఆర్‌పీని చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. కమీషన్లకు అలవాటుపడిన ప్రభుత్వ పెద్దలు ఈ చెల్లింపుల విషయంలో కూడా కమీషన్ల కోసమే జాప్యం చేస్తున్నారేమోననే అనుమానం వ్యక్తం చేశారు. సింగరేణిలో అధికారులు, కార్మికులు వేర్వేరు కాదని, తెలంగాణ ఉద్యమంలో, సకల జనుల సమ్మెలో అధికారులు కూడా పాల్గొని రాష్ట్ర సాధనలో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

- జనరిక్ మందులు, టీబీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు






**కొత్తగూడెం (కలెక్టరేట్), జూన్ 30, ప్రజా జ్యోతి :**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం, జనరిక్ మందులపై అవగాహన కార్యక్రమం, టీబీ ముక్త్ జన జాతి అభియాన్ పురోగతి సమీక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 36 సంవత్సరాల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులను సన్మానించారు. ప్రతి నెల పదవీ విరమణ చేసే ఉద్యోగులను జిల్లా కేంద్రంలో సన్మానించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు డీఎంహెచ్ ఓ తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పని వ్యాయామం, యోగా, సమతుల్య ఆహారం, మానసిక ప్రశాంతతతో జీవించాలని సూచించారు. అనంతరం సమగ్ర అభివృద్ధి వేదిక (ఎస్ ఏవీ) నిర్వహించిన జనరిక్ మందుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, జనరిక్ మందులు కూడా బ్రాండెడ్ మందులతో సమానమైన నాణ్యత, భద్రత, ప్రభావం కలిగి ఉంటాయని తెలిపారు. వైద్యుల సూచన మేరకే మందులు వాడాలని, స్వయంగా మందులు తీసుకోవద్దని సూచించారు. టీబీ ముక్త్ జనజాతి అభియాన్ పురోగతిపై నిర్వహించిన సమీక్షలో గిరిజన ప్రాంతాల్లో ఇంటింటి సర్వేలు, యాక్టివ్ కేస్ ఫైండింగ్, ఛాతీ ఎక్స్ రేలు, కఫ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు గుర్తింపు, పూర్తి చికిత్స, ప్రజల్లో అవగాహనతో టీబీ రహిత గిరిజన సమాజ నిర్మాణమే లక్ష్యమని పేర్కొన్నారు.

## గోధుమవాగు బ్రిడ్జిపై గుంతల మరమ్మత్తులు ప్రారంభం

- పనులను పరిశీలించిన కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్



**కొత్తగూడెం, జూన్ 30, ప్రజా జ్యోతి :**కొత్తగూడెం పట్టణంలోని రామవరం గోధుమవాగు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల మరమ్మత్తు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో చేపట్టిన ఈ పనులను మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిడ్జిపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాల నివారణ దృష్ట్యా మరమ్మత్తు పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. బ్రిడ్జి నిర్వహణకు సంబంధించి జాతీయ రహదారుల అధికార యంత్రాంగం కూడా సమస్యపై తక్షణ చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని మేయర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయిన విజయ్‌కుమార్, కూరపాటి సుధాకర్, జి. వెంకటేశ్వర్లు, నాయకులు ఎండి. యూసుఫ్, ధర్మరాజు, పి. సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

## కేతన్ గార్డెన్‌లో పండ్ల మొక్కలు నాటిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, జూన్ 30,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని కొప్పు స్వామి నగర్‌లో కలతూర్ మునుస్వామికి చెందిన కేతన్ గా ర్డెన్‌లో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటించారు.గార్డెన్‌లో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి హరితహారానికి తన వంతు సహకారం అందించారు. అ నంతరం ఇప్పటికే గార్డెన్ లో పెంచుతున్న మా మిడి, జామ, సపోటా, నేరేడు తదితర పండ్ల మొక్కలను పరిశీలించారు. వాటి పెరుగుదల, నిర్వహణను చూసి ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటు ఫలవృక్షాల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్న నిర్వాహకుడు కలతూర్ మునుస్వామిని అభినందించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సంజయ్ ఈశ్వర్ నాయక్, మునుస్వామి, కందస్వామి, నాగినేని నరసింహారావు పాల్గొన్నారు.

## 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి

- కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్
- నేడు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సంయుక్త ధర్నా

**కొత్తగూడెం, జూన్ 30, ప్రజా జ్యోతి :**సింగరేణి కార్మికుల 11వ వేతన ఒప్పందం జూన్ నెలతో ముగియనున్న నేపథ్యంలో, జూలై 1 నుంచి అమల్లోకి రావాల్సిన 12వ వేతన ఒప్పంద ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. 40 శాతం ఫిట్ మెంట్ తో 12వ వేతన కమిటీని ఏర్పాటు చేసి, వేతన చర్చలను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని కోరింది. మంగళవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్ లో నిర్వహించిన జేఏసీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల న్యాయమైన వేతన హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తున్న బొగ్గు పరిశ్రమలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు న్యాయమైన వేతన ఒప్పందాన్ని అమలు చేయడంలో జాప్యం చేయడం సమంజసం కాదన్నారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించనున్న సంయుక్త ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అదే రోజు అన్ని గనులు, విభాగాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. 12వ వేతన ఒప్పంద చర్చలు ప్రారంభించి, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సెంట్రల్ కార్యదర్శి వంగ వెంకట్, వీరస్వామి, మల్లికార్జున్ రావు, రమణమూర్తి, క్రిస్టోఫర్, కత్తర్ల రాములు, గట్టయ్య, హుమాయూన్, మాతంగి లింగయ్య, బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, ఐఎన్ టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, వైస్ ప్రెసిడెంట్లు పీతంబరం, ఆల్బర్ట్, మధుసూదన్, ఎం. శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మంద నర్సింహారావు, విజయగిరి శ్రీనివాస్, వై.వి.రావు తదితరులు పాల్గొన్నారు.






# జెన్కోతో సింగరేణి బంధాలకు బీటలు..!

- జెన్కోకు బొగ్గు రవాణా తగ్గించిన సింగరేణి..
- మొండి బకాయిల నేపథ్యంలోనే ఈ నిర్ణయం..
- అప్రాధాన్య జాబితాలోకి జెన్కో..
- థర్మల్ కేంద్రాల్లో పడిపోయిన బొగ్గు నిల్వలు..
- పలు కేంద్రాల్లో యూనిట్లను మూసేసిన వైనం..
- బొగ్గు కొరతతో పవర్ ప్లాంట్లలో సతమతమవుతున్న అధికారులు..
- రాష్ట్ర విద్యుత్ భద్రతపై పెరుగుతున్న ఆందోళన..
- రాష్ట్ర విద్యుత్ అవసరాల కంటే వ్యాపారానికే పెద్దపీట వేస్తున్న సింగరేణి..?

**తెలంగాణ విద్యుత్ రంగానికి రెండు కళ్లుగా భావించే సింగరేణి, తెలంగాణ జెన్కో మధ్య సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంతగా దెబ్బతిన్నాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జోరుగా సాగుతోంది. జెన్కో నుంచి సింగరేణికి వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడం, వాటి చెల్లింపులో నెలకొన్న జాప్యమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. మరోవైపు సింగరేణి కూడా లాభదాయకమైన మార్కెట్ల వైపు అడుగులు వేయడంతో ఈ రెండు సంస్థల బంధాలకు బీటలు పడినట్లు సమాచారం. ఈ పరిణామాలే ఇప్పుడు రాష్ట్ర విద్యుత్ రంగంలో కొత్త ఆందోళనలకు దారితీస్తున్నాయి.**


● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### ● మొండి బకాయిలే అసలు కారణం....

ఒకప్పుడు తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చిన సింగరేణి, ప్రస్తుతం తన వ్యాపార వ్యూహాన్ని మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఈ-వేలం, ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థలు, ప్రైవేట్ పరిశ్రమలకు బొగ్గు విక్రయించడం ద్వారా అధిక ఆదాయం సమకూర్చుకోవడంపై సంస్థ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో జెన్కోకు కేటాయించే బొగ్గు సరఫరా క్రమంగా తగ్గుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఈ నిర్ణయం ప్రభావం రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలపై స్పష్టంగా కనిపించడం ప్రారంభమైంది. ఇందులో ప్రధాన కారణం తెలంగాణ జెన్కో నుంచి సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరుకున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ బకాయిల మొత్తం దాదాపు రూ.20 వేల కోట్లకు పైగా ఉంటుందనే సమాచారం వినిపిస్తోంది. జెన్కో నుంచి సకాలంలో చెల్లింపులు జరగకపోవడంతో సింగరేణి నగదు ప్రవాహంపై తీవ్ర ప్రభావం పడినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల వేతనాలు, గనుల నిర్వహణ, యంత్రాల కొనుగోలు, కొత్త ప్రాజెక్టుల అమలుకు భారీగా నిధులు అవసరమవుతున్న నేపథ్యంలో ఈ బకాయిల భారం సంస్థపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లోనే సకాలంలో చెల్లింపులు చేసే వినియోగదారులకు బొగ్గు సరఫరాలో ప్రాధాన్యం ఇవ్వాలని సింగరేణి నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో జెన్కోకు కేటాయించే బొగ్గు పరిమాణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ● విద్యుత్ ఉత్పత్తిపై మరింత ప్రభావం....

ఇప్పటికే రాష్ట్రంలోని కేటీపీఎస్, భద్రాద్రి, యాదాద్రి, కేటీపీపీ విద్యుత్ కేంద్రాల్లో ఆరు నుంచి ఏడు రోజులకే సరిపడే బొగ్గు నిల్వలు మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉండటంతో ఈ నిల్వలు ఏమాత్రం సరిపోవని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి తగ్గడం, రైల్వే రేకుల కొరత, రవాణా సమస్యలు కూడా పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. అయితే ఇలాంటి పరిస్థితులు గతంలోనూ వచ్చినప్పటికీ జెన్కోకు బొగ్గు సరఫరాలో అంతరాయం కలగకుండా సింగరేణి చర్యలు తీసుకునేదని విద్యుత్ రంగ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని, బొగ్గు కొరత కంటే మొండి బకాయిల ప్రభావమే సరఫరా విధానంలో మార్పులకు ప్రధాన కారణంగా కనిపిస్తోందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల ప్రభావం ఇప్పటికే రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో కొన్ని చోట్ల యూనిట్ల నిర్వహణ, మరికొన్ని చోట్ల విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ అధికారులకు సవాల్ గా మారినట్లు సమాచారం. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యుత్ ఉత్పత్తిపై మరింత ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని పలువురు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, సింగరేణి గత కొన్నేళ్లుగా లాభాలపైనే ప్రధాన దృష్టి సారిస్తోంది. ఇప్పటికే సంస్థకు రావలసిన బకాయిల భారం పెరిగిందని కొందరు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సకాలంలో చెల్లింపులు జరిగే వినియోగదారులు, అధిక ఆదాయం వచ్చే మార్కెట్లకే సంస్థ ప్రాధాన్యం ఇస్తోందనే సమాచారం వినిపిస్తోంది. అందులో భాగంగానే ఈ-వేలం ద్వారా బొగ్గు విక్రయాలు, ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థలు, ప్రైవేట్ పరిశ్రమలకు సరఫరాను విస్తరిస్తూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యూహం సింగరేణి ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడానికి దోహదపడుతున్నప్పటికీ, రాష్ట్ర విద్యుత్ అవసరాల కంటే వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.



### ● తక్షణమే ప్రభుత్వ జోక్యం అవసరం....

ప్రభుత్వ ఆధీనంలోని రెండు కీలక సంస్థల మధ్య నెలకొన్న ఈ ఆర్థిక ప్రతిష్టంభనకు త్వరగా పరిష్కారం లభించకపోతే దాని ప్రభావం కేవలం సింగరేణి, జెన్కోకే పరిమితం కాకుండా రాష్ట్ర విద్యుత్ భద్రతపైనా పడే అవకాశం ఉందని విద్యుత్ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవైపు సింగరేణి లాభదాయక వ్యాపార విధానాన్ని కొనసాగిస్తుండగా, మరోవైపు జెన్కో బొగ్గు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడడం రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త సవాలుగా మారిందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. అయితే ఒక వైపు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి, మరో వైపు బొగ్గు సరఫరా రెండు సంస్థల ఆర్థిక ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించేలా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జెన్కో బకాయిల పరిష్కారం, బొగ్గు సరఫరా విధానంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే ప్రస్తుతం రెండు సంస్థల మధ్య కనిపిస్తున్న ఈ ఆర్థిక విభేదాలు భవిష్యత్తులో రాష్ట్ర విద్యుత్ రంగానికే పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

# రైతు భరోసా నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- ములకలపల్లి మండలం లోని 10,400 మంది రైతులకు రూ.19.44 కోట్ల రైతు భరోసా
- జగన్నాథపురం రైతు వేదికలో రైతులతో కలిసి సీఎం కార్యక్రమాన్ని వీక్షించిన కలెక్టర్





**ములకలపల్లి, జూన్ 30 (ప్రజాజ్యోతి):** రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతు భరోసా కింద అందిన నిధులను నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ములకలపల్లి మండలంలోని పూసుగూడెం, జగన్నాథపురం రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించారు. జగన్నాథపురం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొని రైతులతో కలిసి కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్ బాబు మాట్లాడుతూ, ములకలపల్లి మండలంలోని 10,400 మంది రైతులకు రూ.19.44 కోట్ల రైతు భరోసా నిధులు విడుదలైనట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ విత్తన మేళాను సందర్శించి రైతులకు ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండి, అధికారికంగా ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేసి శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబు రావు, జిల్లా ఉద్యానవన అధికారి కిషోర్, తహశీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీఓ ఎస్.వి. సత్యనారాయణ, సర్పంచులు కుంజా వినోద్, కారం చంద్రకళ, మడకం విజయ, సోడే చైతన్య, కల్లూరి కిషోర్, దమ్మపేట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కణితి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కారం సుదీర్, కొప్పుల రాంబాబు, మడకం శ్రీను, పామర్తి కృష్ణ, గుంట్రూ సాయిరాం, మీడియం నారాయణ, రైతులు నరుకుళ్ల రంగారావు, తన్నీరు సుబ్బారావు, తదితరులు.

# 60 శాతం కాలిన గాయాల నుంచి కొత్త జీవితం

- భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో విజయవంతమైన శస్త్రచికిత్స
- క్రమంగా కోలుకుంటున్న యువకుడు



**భద్రాచలం, జూన్ 30, ప్రజా జ్యోతి :** విద్యుత్ షాక్ కు గురై శరీరంలో 60 శాతం వరకు కాలిన గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యం మెరుగుపడుతోందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా సుదిబాక గ్రామానికి చెందిన మడప భాస్కర్ విద్యుత్ షాక్ కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్ లోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించగా భారీగా ఖర్చు కావడంతో కుటుంబ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును ఆశ్రయించారు. ఆయన చొరవతో భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారు. రోగి పరిస్థితిని పరిశీలించిన వైద్య బృందం ప్లాస్టిక్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స నిపుణుల సహకారంతో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం బాధితుడు వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నట్లు తెలిపారు. తమ కుమారుడికి మెరుగైన వైద్యం అందించి కొత్త జీవితం ఇచ్చిన వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాల ప్రదానం





**కొత్తగూడెం (క్రైం), జూన్ 30, ప్రజా జ్యోతి :** పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. 37 సంవత్సరాల పాటు సేవలందించిన మల్లెంపాటి తిరుమలరావు, పెయ్యాల ప్రసాద్, సాలి పాపయ్య, 36 సంవత్సరాల సేవ అనంతరం పదవీ విరమణ పొందిన మట్టూరి సత్యనారాయణ, కుప్పా వెంకట విశాల్ కుమార్‌లకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు అంకితభావంతో సేవలందించిన పదవీ విరమణ పొందిన అధికారులు నూతన పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. వ్యాయామం, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను కొనసాగించాలని సూచించారు. అలాగే పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి అవసరమైన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్, లాల్‌బాబు, కృష్ణారావు, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ

- జిల్లాలో 1.78 లక్షల మంది రైతులకు రూ.318.42 కోట్లు విడుదల



**కొత్తగూడెం (కలెక్టరేట్), జూన్ 30, ప్రజా జ్యోతి:** వానాకాలం–2026 సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభ ప్రత్యక్ష ప్రసారాన్ని ములకలపల్లి మండలం జగన్నాధపురం రైతు వేదికలో రైతులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 1,91,340 మంది రైతులకు రూ.337.06 కోట్ల పెట్టుబడి సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటివరకు 1,78,828 మంది రైతుల ఖాతాల్లో రూ.318.42 కోట్లను జమ చేసినట్లు చెప్పారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా సాంకేతిక ప్రక్రియ పూర్తయ్యాక విడతల వారీగా నిధులు జమ చేస్తామని పేర్కొన్నారు. జూన్ 15 వరకు భూభారతి రికార్డుల్లో నమోదైన అటవీ హక్కుల చట్టం పట్టాదారులను కూడా రైతు భరోసా పథకంలో పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హత ఉండి కూడా పెట్టుబడి సహాయం అందని రైతులు గ్రామ పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. జూలై 5లోపు రైతు భరోసా పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి అర్హత మేరకు లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం విత్తన మేళాలో భాగంగా వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు కలెక్టర్ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సర్పంచ్ కుంజా వినోద్, తహసీల్దార్ స్వాతిబిందు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, ఎంపీడీవో సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల
- రైతు భరోసా నిధుల విడుదలపై లైవ్ టెలికాస్ట్ లో పాల్గొన్న కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 30, (ప్రజాజ్యోతి)** రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని పాల్వంచ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రైతు భరోసా పథకం కింద మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 9 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం గ్రామంలోని రైతు వేదికలో జరిగిన రైతు భరోసా లైవ్ టెలికాస్ట్ లో కొత్వాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ 9,000 కోట్ల రూపాయలు తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతులకు రెండు లక్షల రుణమాఫీ, సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు 500 రూపాయలు బోనస్, 5 లక్షల రైతు బీమా, 24 గంటల విద్యుత్ సరఫరా పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందన్నారు. రైతులకు ఎంతో మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరూ సహకారం అందించాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి. శంభోశంకర్, ఏ.ఈ.ఓ.లు వై.సత్యం, పవన్, విశాల, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొండ వెంకన్న గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగిరెడ్డి భువన సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.